# ఆ మె

"కలెక్టర్ గారి భార్య, రిక్షా ఎలా ఎక్కుతుందోయ్ ?" అనేసి, నేను రిక్షా ఎక్కి కూర్చున్నాను. రిక్షావాడు ఆమె కేసి చూస్తూ ఏదో గొణిగాడు. అంతవరకూ నిలువునా చిటపట మంటూ పడుతూన్న చినుకులు, హఠాత్తుగా గాలి విసురుకు రిక్షాలోకి దూసుకు వచ్చినై. రిక్షా ముందు వున్న పట్టా కిందకి జార్చి పక్కగా ఆమె కేసి చూశాను.

ఆమె కూడా నాకేసే చూస్తోంది. వాన జల్లుకు షెల్టర్లో నిల్చున్నదల్లా ఇంకొంచెం వెనక్కు

జరిగి నిల్చున్నది. ఆమె మొహాన కత్తివాటుక్కూడా నెత్తురుచుక్క లేదు. ఆలిచిప్పల్లాంటి ఆ పెద్ద కళ్ళను తెరిచి నిస్తేజంగా నాకేసి చూస్తోంది. పెదాలు కదిలినట్లు కన్పించాయి. నాలో ఏదో జాలి. నా మాటల్తో అంత బాధ పెట్టానా? పాపం! అనిపించింది. సాంత్వన వచనాల్తో క్షమించమని అడుగుదామనుకున్నాను. కాని ఆత్మాభిమానం ఎదురు తిరిగింది.

రిక్షావాడికి వెళ్ళవలసినచోటు చెప్పి, తిరిగి ఆమెకేసి తల తిప్పాను. అంతలోనే హారన్ కొడుతూ ఒక బస్సు.... రెండు....దిగే జనం....ఎక్కే జనం....ఆమె నా దృక్పథం నుంచి తప్పుకుపోయింది.

రిక్షావాడు తల వొంచుకుని పరుగెడుతున్నాడు. గాలి విసిరినప్పుడల్లా చినుకులు సూదుల్లా వచ్చి నా మొహాన్నీ, కాళ్ళనూ తాకుతున్నాయి. పెళపెళమనే ఉరుములతో ఆకాశభాండం ఓడిపోయినట్లు పేలవంగా ధ్వనిస్తోంది. నా దురుసుతనానికీ, తొందరపాటుకూ మనస్సు చివుక్కుమన్నది.

ఆమెను—అవును—ఆమె పేరు కూడా నాకు తెలీదు; అంత కర్కశమైన మాటల్తో పరిహసించవలసింది కాదు!

స్త్రీ సహజమైన సానుభూతి, సహనాల్లాంటివి మరొక స్త్రీ విషయంలో ఎందుకు చూపలేకపోయానా అన్న అనుమానం, సంశయం నన్ను బాధిస్తోంది.

రిక్షా వాకిటిముందు నిల్చింది. నా ఆలోచనల్తో.... అన్యమనస్కంగా రిక్షా దిగి డబ్బులిచ్చి మెట్లు ఎక్కాను. అమ్మ వాకిట్లో నిలబడి వుంది. నన్ను చూస్తూనే అదుర్దాతో కూడిన ముఖంమీదికి, పట్టరాని కోపాన్ని తెచ్చిపెట్టుకుని-

"గొడుగు ఎందుకు తీసుకెళ్ళలేదు?" అంటూ ప్రారంభించింది.

ఇక అలాంటి సమయాల్లో నేను జవాబు చెబితే అమ్మ చదవబోయే కుమారీ శతకం నాకు తెలియంది కాదు.

"పెద్దవాళ్ళంటే లక్ష్యం వుండాలి. నేనన్నా, నా మాటలన్నా దూడపుల్లాయి కింద కట్టేస్తావు."

నేను కిక్కురుమనకుండా కాళ్ళు కడుక్కుని, వానజల్లుకు తడిసిన జుత్తును తుడుచుకుంటూ కుర్చీలో కూర్చున్నాను. బయట వానజల్లు తగ్గినట్లుగా వుంది. కిటికీ రెక్క పక్కకు నెట్టి ఆకాశంకేసి చూశాను. మబ్బులు విచ్చిపోతూ సూర్యకిరణాలకు దారి ఇస్తున్నాయి. అంతా మద్రాసు వాతావరణం. అంతలో వాన, అంతలో ఎండ!

ఆమె మానసిక తత్వం అంతేనేమోననిపించింది. ఎంత హుందాతనం—ఎంత ధీమా, దర్పం ప్రదర్శించింది! అంతలోకే అబలలా, ఛాయామాత్రంగానైనా వ్యక్తిత్వంలేని దానిలా....అంతా ఒక్క మాటతో—

* * *

అప్పటికి అర్థగంటనుంచి బస్సుకోసం చూస్తున్నాను. నాకు కావలసిన బస్సు తప్పితే తతిమ్మా బస్సులూ ఎడతెరిపి లేకుండా పోతున్నాయి. ఆరు గంటల వరకూ ఆఫీసు పనిచేసి విసగి వేసారి వున్నానేమో! పైగా వానజల్లొకటి లంకించుకున్నది. చాలా చిరాగ్గా వుంది. టప్ టప్ మని ఎవరో చిల్లపెంకులు గురిచూడకుండా విసిరినట్లు అక్కడో చినుకు, ఇక్కడో చినుకు. తలెత్తి చూశాను. ఆకాశం చిన్నా పెద్ద మేఘాల్ని కంబళీల్లా కప్పుకుంటోంది. ఇక వాన తప్పదు. అక్కడవున్న షెల్టర్‌లోకి వెళ్ళబోయాను. ఇంతలోనే నేను ఎక్కవలసిన బస్సు వచ్చింది.

దిగవలసినవాళ్లు దిగకముందే కొందరు తోసుకుంటూ ఎక్కసాగారు. ఎలాగయితేనేం నేనూ బస్సు కడ్డీ పట్టుకో గలిగాను. ఎక్కుతూండగానే ఎవరిదో మోచెయ్యి పొడుచు కున్నందువల్ల ముక్కు నొప్పి పుట్టడమే కాకుండా, కళ్ళజోడు కూడా ఒక చెవ్వునుంచి తప్పుకున్నది: అదృష్టంకొద్దీ కింద

పడలేదు. ఆ వచ్చే అరవయి జీతపురాళ్ళలో మిగిల్చి కొత్త జోడు కొనాలంటే ఏ ఆరునెల్లో పట్టవచ్చు. ఇంతలో ఏదో వీపుకు గట్టి వస్తువు కొట్టుకొని ప్రాణం కడబట్టినంత పని అయిoది.

తీరా చూస్తే ఒక యువతి. చూట్టానికి డొక్కశుద్ధి కలదానిలాగ్గానే వున్నది. చేతిలోవున్న లెదర్ సూట్‌కేసుతో నన్ను నెట్టుకుంటూ పోయి, ఆడవాళ్ళకు రిజర్వుచేసిన వెనుక సీటులోనే కూర్చున్నది. కోపం వచ్చినా చేసేదేమీ లేక ఆమె పక్కనే కూర్చున్నాను. కళ్ళజోడు సవరించుకుంటూ, పక్కనే కూర్చున్న ఆమెను మింగుదామా అన్నట్లు చూశాను. ఆమె తక్కువ తింటేగా! నన్ను మింగుదామా అన్నట్లు ఆపాదమస్తకం చూస్తున్నది. నన్ను శల్యపరీక్ష చేస్తున్న ఆమె చూపులు 'నేను ఎవరిననుకున్నావ్' అని సవాలుచేసి అడుగుతున్నట్లున్నాయ్.

ఆమె తీక్షణ వీక్షణాల ముందు నా చూపులు అట్టేకాలం నిలబడలేకపోయాయి. ముఖం పక్కకు తిప్పుకుని ఏదో ఆలోచించుకోసాగాను. దాదాపు ఆమె విషయమే మరచిపోయాననే చెప్పాలి.

"అనాగరిక జంతువులు! వెధవ తొక్కిసలాట!" అన్న ఆమె మాటలకు ఉలిక్కిపడి నాకు తెలియకుండానే అనేశా "ఎవరూ?" అని.

" వీళ్ళే " అంటూ నిల్చోటానికి కూడా చాలినంత లేక బస్సు కుదుపులకు ఉయ్యాలలూగుతున్న ఓ అరవయి సంవత్సరాల ముసలమ్మను, పది సంవత్సరాల పిల్లను—బహుశా ఆమె మనమరాలు కావచ్చు—చూపించింది.

బస్సులో ఎక్కేటప్పుడు ఆమె చూపిన సభ్యతా, నాగరికతా నాకు గుర్తుకొచ్చింది. ముక్కు ఇంకా నొప్పి పెడుతూనే వుంది.

ఆమె మాటల తీరూ, ముఖంలో పుట్టిపడే హుందాతనం, కళ్ళలోనుంచి తొంగిచూస్తున్న అహంభావం చూస్తే; ఎప్పుడూ ఎవర్నీ అనవసరంగా పలకరించని నాకు కూడా, ఆమెతో మాట్లాడబుద్ధి పుట్టింది.

" ఏమండీ, మీరు తెలుగువారా ? " అన్నాను.

" అవును " ఒక్కొక్క అక్షరాన్నీ నొక్కుతూ అన్న ఆ మూడక్షరాల ఆ 'అవును'లో ఎంత బరువు కన్పించింది !

" నీవూ ? " నేను మొదట్లో, ఆ ఏకవచన ప్రయోగం నన్ను ఉద్దేశించింది కాదేమో అనుకున్నాను. కాని మరల అదే ప్రశ్న వినబడింది. తలతిప్పి చూశాను. నన్నే అడుగుతోంది. నాకు చెడ్డ కోపం వచ్చింది. కానీ ముందు పలకరించిన నేరానికి పశ్చాత్తాపపడుతూ అన్నాను, " అవును, నేను తెలుగుదాన్నే " అని.

"మద్రాసులో ఏమి చేస్తున్నావూ ?" రాగయుక్త స్వరంతో అడిగింది.

"పని చేస్తున్నానూ" ఇంకొంచెం రాగంతీస్తూ చెప్పాను.

ఆ తరవాత రాబోయే ప్రశ్న ఏదో నాకు తెలుసు. ఆమెకు అవకాశం ఇవ్వకుండా ఎదురు ప్రశ్న వేశాను—

"నీవేమి చేస్తున్నావూ ?" అన్నాను అదే స్వరంతో.

"నేనేమీ చేయనవసరం లేదు" అన్నదామె తడుముకోకుండా, ఆ ప్రశ్న కోసమే ఎదురుచూస్తున్నట్లు. నేను గతుక్కుమన్నాను. కాలాంతకురాలే అనిపించింది.

"ఎందుకని అవసరం లేదూ ?" అన్నాను ఉక్రోషం కొద్దీ.

"నేను గొప్ప కుటుంబంలోని దాన్ని. నాకు పనిచేయాల్సిన అవసరం లేదు."

పనిచేయటం, స్వతంత్రంగా జీవించటం చాలా హేయమైనట్లూ, పనిచేసే వాళ్ళంతా తక్కువ కుటుంబాల వాళ్ళన్నట్లూ, మాట్లాడే ధోరణి, అహంకారం చూస్తే, ఈమెకు ఒక పాఠం నేర్పకుండా వదలకూడదనిపించింది. ఇలాంటివాళ్ళు తమకంటే పైవాళ్ళను చూసినప్పుడు కుళ్ళిపోతూ, కిందివాళ్ళను చూసినప్పుడు తమ ముందు

వాళ్ళంతా చీమలూ, దోమలూ అనుకొని తృప్తిపడతారు. పైకి ఎగరటానికి ప్రయత్నిస్తూ ఇంకొంచెం కిందకు జారుతూంటారు పాపం!

"ఏమి పనిచేస్తున్నావూ ?" అన్నది ఆమె మళ్ళీ !

ముఖంలో లేని గాంభీర్యాన్ని, నిండుతనాన్నీ తెచ్చిపెట్టుకుంటూ అన్నాను—

"కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాను."

"జీతమెంత ?"

వచ్చేది అంతకంటే చాలా తక్కువైనా ఆమెకు రెండువందలకంటే తక్కువ చెప్పబుద్ధి పుట్టలా.

"రెండు వందలు" అన్నాను.

షాక్ తిన్నట్లు సీటులో తక్కున కదుల్తూ, నా కళ్ళలోకి ఓమారు సూటిగా చూసి, 'ఫర్వాలేదే, నీవే నయం! ఒక్కదానివీ రెండు వందలు సంపాయిస్తున్నావూ!' అన్నది నొక్కి పలుకుతూ.

ఆ వాక్యంలోని ధ్వని నాకు బోధపడలేదు. వినిపించనట్లు నటించాను. ఆమె వొదిలేనా ? అదే వాక్యాన్ని వత్తి వత్తి మరల నా చెవి దగ్గర అన్నది. వళ్ళు మండి —

"మీరు ఇద్దరులాగా వున్నారు. మీ ఇద్దరూ కలిసి ఎంత సంపాయిస్తున్నారేం ?" అన్నాను కొంచెం వ్యంగ్యంగా.

ఆమె అహంకారానికి దెబ్బ తగిలి వుంటుంది. చిరచిరలాడుతూ కనుబొమలు చిట్లించి అన్నది—

"మా నాయన చాలా గొప్పవారు."

"ఓహో, అలాగా! మీ నాయనగారి నామధేయం?" అన్నాను, కొంటెగా నవ్వుతూ.

"నారాయణమూర్తి, జస్టిస్ పార్టీ లీడర్. ఆయనకు గొప్ప గొప్ప వాళ్ళంతా తెలుసు!"

"ఏదీ, నేను ఆయన పేరు ఎక్కడా వినలేదే" అన్నాను. నేను ఆ గొప్ప వాళ్ళలో ఒకదాన్నయినట్లు.

ఈమె దగ్గర తగ్గి మాట్లాడితే ప్రయోజనం లేదనుకుని ఆమెకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా అందుకున్నాను—

"మా నాన్న కూడా చాలా గొప్పవారే. నాకూ పనిచేయాల్సిన అవసరంలేదు. ఏదో సరదాగా చేస్తున్నాను" అన్నాను.

మా నాన్న ఎవరని అడిగితే కనీసం ఒక చిన్న మంత్రిగారి పేరుకు తక్కువ చెప్పకూడదనుకున్నాను.

ఇప్పుడు ఆమె నేను చెప్పింది వినే స్థితిలో లేదు. తను చెప్పేది నేను నమ్మటం లేదనే బాధలో, ఇంకా ఏం చెప్పాలా ? అనే సందిగ్ధంలో పడ్డదిలాగున్నది. ఏదో జ్ఞాపకం వచ్చినట్లు విప్పారిన ముఖంతో అన్నది :

" మా ఆయన కలెక్టరు ! "

ముందే నేను పెళ్ళికాలేదని చెప్పినందుకు పశ్చాత్తాప పడుతూ అన్నాను—

" ఎక్కడ ? "

" బళ్ళారిలో "

వెంటనే ' బిల్లు కలెక్టరా ? ' అందామనిపించింది. పరల ఒకసారి ఆమె వేష భూషణాల్ని పరికించి చూడసాగాను. ఈ రోజుల్లో చౌకగా వచ్చే ఇరవైఏడు ముప్ఫై రూపాయల బెంగళూరు సిల్కు చీరా, క్రేప్ జాకెట్ చూస్తే కొంచెం ఆస్తిపాస్తులు వున్నదానిలాగే వున్నది. మెడలో చౌకబారు పూసలదండా, చేతులకు మట్టిగాజులు చూస్తే మా స్నేహితురాలు ఒకసారి అన్న మాటలు గుర్తొచ్చాయి. ' అరవ దేశంలో ముఖ్యంగా కొన్ని కుటుంబాల్లో ఎంత బీదవాళ్ళకైనా సరే ఒక పట్టుచీరా, వెండి మరచెంబూ తప్పక వుంటాయి. ప్రయాణాలకు బయలుదేరితే ఇంటి కోడళ్ళు పట్టుచీర కట్టి వెండి మరచెంబు

చేత్తో పట్టుకొని, చంకలో నిలవకుండా జారిపోయే పిల్లవాణ్ణి పైకి లాక్కుంటూ, వెనక్కు కూడా తిరిగి చూడకుండా ధీమాగా నడిచే భర్త వెనక నడుస్తుంటారు. '

" మాకు బళ్ళారిలో పెద్ద బంగళా వున్నది ! "

ఆలోచనల్లో మునిగివున్న నేను యథాలాపంగా అనేశాను. " అం _ ఈ రోజుల్లో బంగళాలకు ఏమి తక్కువ. మాకూ వున్నవి అడయారులో రెండు ! "

' ఐతే ఇటు వెళ్తున్నావేం ? ' అన్నది విసురుగా.

' ఇక్కడా ఒక బంగళా వుంది ' అన్నాను నవ్వుతూ.

వచ్చే కోపాన్ని అణుచుకుంటూ అన్నది ' ఎక్కడ ? '

' నేను వెళ్ళేచోటే ' అన్నాను పెంకెగా.

" నేను చెప్పిందంతా అబద్ధం అనుకుంటున్నావు లాగున్నది. ఇక నన్ను మాట్లాడించకు " అన్నది విసురుగా తల తిప్పుతూ.

ఇంతసేపూ నా బలవంతంమీదనే మాట్లాడినట్లు అన్న ఆమె మాటలకు నాకు కోపం వచ్చింది.

' అబ్బే, మీరు చెప్పిందంతా నిజమేననుకుంటున్నా. అయితే నాకు తెలియకడుగుతా. కలెక్టర్‌గారి సతీమణి అయివుండీ, ఇంత చీకటిపడి, ఈ బస్సుల్లో ప్రయాణం చేయాల్సిన ప్రారబ్ధం ! ' అన్నాను.

కథా నిలయం
513


" మా కారు షాప్లో వుంది. ఇక్కడ ఎందుకుంటుంది ? " అన్నది.

" కారు లేకపోయినా, కనీసం టాక్సీలోనన్నా పోవాలి. అబ్బే, మీ గొప్పతనానికి ఇలా రావటం, ఏమీ బాగాలేదు. పైగా పెట్టెను స్వయంగా మోయటం అంతకంటే బాగాలేదు, " అంటూ నవ్వాను.

ఆమె కళ్ళు చింతనిప్పుల్లా అయినై. అవమానంతో కూడిన కోపంతో ఆమె పెదవులు వణుకుతున్నాయి. నా పాచిక పారినందుకు విజయగర్వంతో ఈమె కళ్ళల్లోకి చూశాను. ఆమె ముఖం తిప్పుకున్నది. చచ్చిన పామును కొట్టటం దేనికని ఊరుకున్నాను.

వివాహితలైన స్త్రీలు....అందరూ కాదనుకోండి.

తమ భర్తల గొప్పతనాన్ని-అంటే సంపాయించటంలో పెద్దతనాన్ని ఇలా బస్సుల్లో, రోడ్లంట ఎందుకు-పనికట్టుకుని ప్రచారం చేసుకుంటూరా అన్న మీమాంస కలిగింది.

ఇలాంటి ధోరణి గల పరిచయస్తులు కూడా నాకున్నారు. మా రమ కొంచెం ఇంచుమించుగా ఇలాగే చెబుతుంది. ' మీ ఆయన ఏం చేస్తుంటారు ? ' అని ఎవరైనా అడిగితే, ఆ ప్రశ్న కోసమే మొహంవాచి వున్నట్లు-' డాక్టరూ ! ' అనేస్తుంది.

' యం. బి. బి.యెస్సా ? ' అంటే—

'యం. బి. బి.యస్ తప్ప మరెవరూ డాక్టరు కారా ?' అని ఎదురు ప్రశ్న వేస్తుంది.

అసలు సంగతేమంటే రమ భర్త హోమ్యో డాక్టరు. అలా అని ఆయన ఇంటిముందు బోర్డు కట్టుకున్నా, ఈ భార్యా రత్నం మాత్రం ఇతర్ల దగ్గిర ఆ సంగతి ఒప్పుకోవలసి వచ్చేసరికి, నానా హంగామా చేసి, తను బాధపడి ఇతర్లను బాధపెడుతుంది.

ఇలాంటివారికి వ్యక్తిత్వాలంటూ వుండవా ? లేక ఇంకా కలల్లోనే బ్రతుకుతూ, వాస్తవ జీవితంలో వాటికి సమన్వయం కుదరక తలకిందులవుతుంటారా ? అనిపిస్తూంటుంది. అందుకనే ఈ రకం వాళ్ళంతా నాకు పొట్లపొదుల్లాగా, కాకరతీగల్లాగా కన్పిస్తూంటారు. అందుబాటులోవున్న ఏ ముళ్ళకంపకో అల్లుకొని, తరవాత మారాకు తొడిగేందుకైనా వీలు చిక్కక కునారిల్లుతూంటారు.

ఇలాంటి భావాలన్నీ అప్పట్లో నాకు చాలా అస్పష్టంగా తోచినై. నేను దాదాపు ఆమెతో జరిపిన సంభాషణంతా వుబుసుపోక కిందనే జమకట్టాను. కానీ వానజల్లులో బస్సు దిగి ఆమె కూడా నాతోపాటే అక్కడికి వచ్చి నిలబడింది. ఇక్కడే ఈ జరిగిందంతా ఓ కథకు క్లైమాక్సులాగా తయారయింది.

"నమస్తే! ఎక్కడి నుంచి?" అన్నాడు ఓ నడికారు మనిషి, ఆమె షెల్టర్‌లోకి వచ్చి నా పక్కన నిలబడగానే.

"మాంబళం నించి" అన్నదామె నాకేసి బిత్తరపోయి చూస్తూ.

"బళ్ళారిలో వారం రోజుల కిందట రామనాథం కనిపించాడు. నేను రైలు దిగి దిగకముందే నా ముందు నిలబడ్డాడంటే నమ్మండి. ముందు నా దగ్గర టిక్కెట్ వుందో లేదో చూసికానీ, కుశల ప్రశ్నలు వేయలేదంటే ఆశ్చర్యపడనవసరం లేదు. అసాధ్యుడిలాగున్నాడు!"

ఆమె ముఖం వెలవెలపోయింది. ఏదో అనేందుకు గొంతు సవరించుకొనేలోపలే అతను "మళ్ళీ కలుసుకుంటాను, బస్సు వచ్చింది!" అంటూ బస్సుకేసి పరిగెత్తాడు.

నేను నవ్వుతూ ఆమెకేసి చూశాను. ఏదో అందామనిపించింది. ఏమనేదాన్నో ఇప్పుడైతే చెప్పలేను. కానీ అంతలో రిక్షావాడు అక్కడకు వచ్చి 'రిక్షా రిక్షా' అన్నాడు.

నేను, "కలెక్టర్ భార్య, రిక్షా ఎలా ఎక్కుతుందోయ్!" అనేసి, రిక్షాకోసం కాబోలు ముందుకు రాబోతున్న ఆమె కంటే ముందే పోయి రిక్షా ఎక్కి కూర్చున్నాను.

('ఆంధ్రజ్యోతి' మాసపత్రిక — 1953 దీపావళి సంచిక నుంచి)